ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ అండ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జనవరి 29 : మండల పరిధిలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన వరికుప్పల బాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందాడు. బుధవారం మృతుడి కుటుంబాన్ని కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ నాయకులు పరామర్శించా రు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ తరపున వారు రూ.5వేల చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త కేశని మహేశ్‌ను పరామర్శించారు. మహేశ్‌కు లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న వారిని బీఆర్ఎస్ పార్టీ ఆదుకుంటుందని తెలిపారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు అశోక్, పాండునేత, నాగార్జున, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

మాడ్గుల, జనవరి 29 : మండల పరిధిలోని నల్లచెరువు గ్రామానికి చెందిన కట్ట మైసమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన బోదాసు వెంకటేశ్ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి రూ. 3వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలోని వెంకటయ్య, జంగయ్య, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దవేములోనిబావి తండా నాయకులు

కడ్తాల్, జనవరి 29 : మండల పరిధిలోని పెద్దవేములోనిబావితండా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తండాకు చెందిన నాయకులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో వెంటనే వెంచర్‌ను పరిశీలించి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో దేపావత్ పత్యా, దేపావత్ రవి, వినోద్, అఖిల్, సికిందర్, ఆదేశ్, అరుణ్, హరి, రవీందర్, వినయ్, రమేశ్, వెంకటేశ్ తదతరులు ఉన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

- పెద్దమ్మ అలయ నిర్మాణానికి సహకరిస్తా..
- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కొత్తగూడ ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు, జనవరి 29 : ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. పెద్దమ్మ తల్లి ఆలయానికి స్థలం కేటాయించి, నిర్మాణం కోసం సహకరిస్తానని చెప్పారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు గ్రామంలో పెద్దమ్మ ఆలయ నిర్మాణం కోసం భూమి కేటాయించాలని కోరుతూ బుధవారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయం నిర్మించడానికి తన పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వ స్థలం కేటాయిస్తానని చెప్పారు. ముదిరాజ్‌లను అన్ని విధాలుగా ఆదుకోవడానికి కృషి చేస్తానని తెలిపా రు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిట్టల శేఖర్ ముదిరాజ్, నర్సింహ ముదిరాజ్, యాదయ్య ముదిరాజ్, సత్తయ్య ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, నరేందర్ ముదిరాజ్, సురేశ్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు బొక్క వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ బాధితులకు రూ.2కోట్ల పరిహారం అందజేయాలి

భూ సేకరణ అధికారి జీవీ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న భూములు కోల్పోతున్న రైతులు, చిత్రంలో తహసీల్దార్ లలిత

ఆమనగల్లు, జనవరి 29 : గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్ల పరిహారం అందజేయాలని రైతులు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన భూ సేకరణ అధికారి బీవీ రాజును గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. భూములు కోల్పోతున్న రైతు కుటుంబానికి రెండు కోట్ల పరిహారంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగం, ప్యూచర్‌సిటీలో 100 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజు రెడ్డి, యాదిరెడ్డి, పాండు, రాజేందర్, రమేశ్, రవి రాథోడ్, బోద్య తదితరులు ఉన్నారు.

స్కూటీ, కారు ఢీ.. ఒకరు మృతి

యాచారం, జనవరి 29 : స్కూటీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో తక్కళ్లపల్లిగేటు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, దక్షిణ దినాజ్‌పూర్ జిల్లా, కలైబారి మండలం ఫాసియాబాద్ గ్రామానికి చెందిన బాపి రెహమాన్, జుబెల్ అనే ఇద్దరు వ్యక్తులు మండలంలోని తక్కళ్లపల్లి ఆర్‌వీవీ హాచరీస్‌లో పని చేస్తున్నారు. పనిని ముగించుకొని స్కూటీపై తక్కళ్లపల్లికి వెళ్తున్నారు. అదే సమయంలో యాచారం నుంచి మాల్ వైపు వెళ్తున్న కారు వెనకాల నుంచి స్కూటర్‌ను బలంగా ఢీకొట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని మాల్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే స్కూటీ నడుపుతున్న వ్యక్తి బాపి రెహమాన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రగాయాలైన జుబేల్ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాల బస్సును ఢీకొన్న డీసీఎం

ప్రమాదంలో దెబ్బ తిన్న కాలేజీ బస్సు

పెద్దఅంబర్‌పేట, జనవరి 29: హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ప్రైవేటు కళాశాల బస్సును డీసీఎం ఢీకొట్టింది. అబ్దుల్లాపూర్‌మెట్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధి గుంతపల్లిలోని అవంతి కాలేజీ బస్సు నగరం నుంచి వస్తూ మండల కేంద్రంలోని మయూరి కాంటా వద్ద మళ్తుండగా.. నగరం నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం.. కాలేజీ బస్సును పక్క నుంచి ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ జంగారెడ్డి, లెక్చరర్ హైమావతితోపాటు పలువురికి స్వల్పగాయాలయ్యాయి. బస్సు కొంతమేర దెబ్బతిన్నది. వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నిర్లక్ష్యంగా డీసీఎం నడిపిన వ్యక్తిపై లెక్చరర్ చంద్రశేఖర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్

కడ్తాల్, జనవరి 29: విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా బుధవారం షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్వీఎస్ జూనియర్ కళాశాల, కృష్ణవేణి, ప్రగతి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలను నడపవద్దని సూచించారు. రోడ్డుపై విద్యార్థులు నిబంధనలను ఎలా అనుసరించాలో సంబంధించిన గుర్తులను వారికి చూపించి ట్రాఫిక్ రూల్స్‌ను వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్సై కృష్ణనాయక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభించాలని నిరాహార దీక్ష

నిరాహార దీక్ష చేస్తున్న మల్లారెడ్డికి సంఘీభావం తెలుపుతున్న నాయకులు

చేవెళ్లటౌన్, జనవరి 29 : అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి చేవెళ్ల మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు చేవెళ్ల మండలానికి చెందిన పలువురు నాయకులు, గ్రామస్తులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ బీజాపూర్ –జాతీయ రహదారి అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల విస్తరణ రోడ్డు పనులు చేపట్టకపోవడంతో నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే పనులు చేపట్టకపోతే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తామన్నారు. సంఘీబావం తెలిపిన వారిలో చేవెళ్లకు చెందిన మాజీ వార్డు మెంబర్ మల్గారి మల్లా రెడ్డి, నాయకులు జంగయ్య, రాఘవేందర్ గౌడ్, సత్యం, శేఖర్ రెడ్డి, ప్రకాశ్, శివ స్వాములు ఉన్నారు.

కాల్వలో పైపులపై అధికారుల ఫిర్యాదు

పెద్దఅంబర్‌పేట, జనవరి 29: చెరువు కాల్వ దిశను మార్చేలా పైపులు వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు అబ్దుల్లాపూర్‌మెట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మండల పరిధిలోని జాఫర్‌గూడ చెరువు నుంచి వర్షాకాలంలో నీరు పారాల్సిన కాల్వ దిశను మార్చేందుకు కే రాధాకృష్ణతోపాటు పలువురు పైపులు వేశారని, ఇండ్లతోపాటు పరిసర ప్రాంతాలకు వానాకాలంలో తీవ్రమైన సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ వంశీదర్‌గౌడ్ పోలీసులను కోరారు.

యువకుడిపై దాడి కేసు నమోదు

కేశంపేట, జనవరి 29 : యువకుడిపై దాడి చేసిన ఘటనలో కేశంపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన మద్దు సందీప్ (19) అమ్మమ్మగారి ఊరైన కొత్తపేటకు మంగళవారం సాయంత్రం 7.30 గంటలకు వెళ్లాడు. తోటి స్నేహితులైన అభిషేక్, నవీన్, భానును కలిసి వారితో మాట్లాడాడు. ఆ సమయంలో అభిషేక్, సందీప్‌ల మధ్య వివాదం తలెత్తింది. అక్కడి నుంచి సందీప్ బయలు దేరుతుండగా కోపోద్రిక్తుడైన అభిషేక్ బూతులు తిడుతూ తన వద్ద ఉన్న ఇనుప కడ్డీతో సందీప్‌పై దాడి చేశాడు. దాడిలో సందీప్ తలకు, ఇతర చోట్ల గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని నవీన్, భాను దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచాల, జనవరి 29 : మంచాల పోలీస్టేషన్ పరిధిలోని బండలేమూరు గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన అజ్జినాతండా అడవి ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఎస్సై లాలయ్య తెలిపిన వివరాలు.. అజ్జినాతండాకు చెందిన పశువుల కాపరులు అడవిలో పశువులను మేపేందుకు వెళ్లగా అక్కడ ఒక వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి యాచకుడిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేశంపేట, జనవరి 29 : మండల పరిధిలోని అల్వాల, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఈశ్వర్ బుధవారం తెలిపారు. అల్వాల 132/33కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. వినియోగదారులు, రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 28 : పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు కృషిచేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న ప్రారంభించిన పథకాలను పేదలందరికీ అందేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ క మిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

మంచాల : మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన 35మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.11,71,500 విలువైన చెక్కులు మంజూరయ్యాయి. వీటిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ వెదిరె హనుమంతరెడ్డి, మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపాలి

కందుకూరు, జనవరి 29 : క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని మాజీ ఎంపీపీ మంద జ్యోతి పాండు, కందడి శ్రీరామ్ తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఖేలో భారత్‌లో భాగంగా ఏబీపీపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల వ్యాప్త క్రీడలను నిర్వహించారు. క్రీడలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ, యువ త దేశానికి పట్టుకొమ్మలని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. నిమ్మ అంజిరెడ్డి, పృథ్వీజీ, శివకృష్ణ, వెంకటేశ్, భాను ప్రసాద్, జ్యోతి ప్రసాద్, అమరేందర్, నర్సింహ, దినేశ్, అభిరామ్, జగన్, చందు పాల్గొన్నారు

క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే తీర్మానాలా..?

బడంగ్‌పేట, జనవరి 29: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో చివరిసారిగా ఆమోదించిన ఎజెండా అంశాలన్నీ తప్పుల తడకగా ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. ఏ డివిజన్లలో ఎలాంటి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు. డిసెంబర్ మాసంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పెట్టిన ఎజెండా అంశాలను జనవరి 25న ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశంలోనూ పెట్టినట్లు తెలుస్తోంది. చాలా వరకు యథావిధిగా కొన్ని అంశాలను చేర్చినట్లు సదురు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడో చేసిన పనులకు ఇప్పుడు తీర్మానాలు చేయడం ఏ మిటన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల వెంచర్ యజమానులు వేసుకున్న రోడ్లకు కూడా తీర్మానాలు చేయడం పట్ల పెద్ద దు మారం చెలరేగుతోంది. ఇంజినీరింగ్ అధికారులు ఇస్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అన్ని విభాగాలకు సంబంధించిన అంశాలను ఇంజినీరింగ్ విభాగం అధికారులే ఎజెండాలో పెట్టడం పట్ల ఇతర విభాగాల అధికారులు గుర్రుగా ఉన్నారు. కాగా.. పదవి దిగిపోయిన తర్వాత కార్పొరేటర్లు పెదవి విరుస్తున్నారు. ఈ నెల 25న కౌన్సిల్ సమావేశం అయిపోయిన తర్వాత ఎజెండాలో ఉన్న లొసుగులపై మాజీ కార్పొరేటరు ఆరోపణలు చేస్తున్నారు. కార్పొరేషన్‌లో అడ్డగోలుగా నిధులు గోల్‌మాల్ అవుతున్నాయన్న చర్చ జోరు గా సాగుతోంది. ఈ విషయాలపై కొత్తగా వచ్చిన ప్రత్యేక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

వీధి కుక్కల దాడిలో మచ్చల జింక మృత్యువాత

కడ్తాల్, జనవరి 29 : వీధి కుక్కల దాడిలో మచ్చల జింక మృతి చెందినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహ్మద్ అల్ హుస్సేన్ తెలిపిన వివరాలు.. బుధవారం మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర పిరమిడ్ సమీపంలో మచ్చల జింక మృతి చెంది పడి ఉన్నదని ఫారెస్ట్ అధికారులకు మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ సమాచారమందించారు. అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని చనిపోయిన జింకను పరిశీలించి పంచానామా నిర్వహించారు. మండల వైద్యాధికారి మచ్చల జింకకు అటవీ శాఖ అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల దాడి చేయడంతోనే మచ్చల జింక మృతి చెందినట్లు ఆయన నిర్ధారించారు.

రహదారి నిర్మాణంపై హర్షం

కేశంపేట, జనవరి 29 : ఎన్నో ఏండ్లు ఎదురు చూసిన గిరిజనుల రహదారి కల నెరవేరడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని తొ మ్మిదిరేకుల పంచాయతీ పరిధిలోని బాల్యాతండాకు బీటీ రోడ్డు లేకపోవడంతో గిరిజనుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ విషయమై బీస కరుణాకర్‌రెడ్డి పలు మార్లు ఎమ్మెల్యేతోపాటు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పాలకులు రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి పూర్తి చేయించారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసినవారిలో అంజనాయక్, లక్ష్మణ్‌నాయక్, సేవ్యానాయక్, జాన్యానాయక్, రవినాయక్, లచ్చిరాంనాయక్, తండావాసులు ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి.. ఆత్మహత్య

యాచారం, జనవరి 29 : అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య చేసుకొని శవమై తేలాడు. ఈ ఘటన మండల పరిధిలోని నందివనపర్తిలో జరిగింది. సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జాపాల లక్ష్మయ్య (50) అనే వ్యక్తి కుటుంబ గొడవల కారణంగా ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఎక్కడా వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. లక్ష్మయ్య గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొన్నాడు. గురువారం అక్కడ దుర్గంధం రావడంతో స్థానికులు వెళ్లి చూడగా లక్ష్మయ్య మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ కిట్ల శిక్షణ

గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్న ఎక్సైజ్ అధికారులు

మాడ్గుల, జనవరి 29 : కాటమయ్య రక్ష కవచాన్ని గీత కార్మికులు ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై మూడు రోజుల నుంచి బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మాడ్గుల మండల పరిధిలోని ఇర్విన్, కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్, ఆమన్‌గల్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. గీత కార్మికులకు తాటి చెట్లు ఎక్కేటప్పుడు కాటమయ్య రక్షణ సేఫ్టీ కిట్లు ఎలా ఉపయోగపడుతుందో.. ఎలా దాని వాడుకోవాలో గీత కార్మికులకు శిక్షణ ఇచ్చామని సీఐ బద్యానాత్ చౌహాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 200 మంది గీత కార్మికులకు శిక్షణ ఇచ్చామన్నారు. 280 కాటమయ్య రక్షణ కిట్లు ఆమన్‌గల్లు ఎక్సైజ్ స్టేషన్‌కు మంజూరయ్యాయని తెలిపారు. కోఆపరేటివ్ సొసైటీలో మెంబర్‌గా ఉన్న వారికి మాత్రమే ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ శాఖ అధికారులు మాధవరెడ్డి, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో నిర్వహిస్తున్న ఉర్సులో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్‌ను ముస్లింలు సన్మానించారు.

- కడ్తాల్, జనవరి 29

వ్యవసాయ వర్సిటీకి తోడ్పాటు నందిస్తాం

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 29 : తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ రంగంలో పనిచేస్తున్న వారందరికీ గర్వకారణమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణలో సాగు, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత పెరిగిందని, అందుకు అనుగుణంగా ఇతర శాఖల కన్నా, ఈ సారి వ్యవసాయానికి అధిక నిధులు దాదాపు రూ. 50 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి రావడమే కాకుండా యూనివర్సిటీ తన సొంత జిల్లాలో ఉన్నందున ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయనున్నామని సూచించారు. వర్సిటీలో, కంది, వరి లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశ వ్యాప్తంగా గుర్తింపు తేవడం అభినంద నీయమన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఎర్ర, నల్ల రేగడి, ఇసుక వంటి సారవంతమైన నేలలు, అందుకు అనుగుణంగా వాతావరణ పరిస్థితులు, మానవ వనరులు అధికంగా ఉన్నాయని గుర్తు చేశారు .అన్యాక్రాంతానికి గురైన వర్సిటీ భూములను వెనక్కి తీసుకోవడమే కాకుండా, వర్సిటీలో కనీస వసతులు, శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలన్ను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అందరూ మనస్ఫూర్తిగా పని చేసి వర్సిటీని దేశంలోనే మంచి పేరు తీసుకురావాని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో వీసీ జానయ్య, స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేల పేరుతో .. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పదోవ

శంషాబాద్ రూరల్, జనవరి 29 : సర్వేల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏడాది నుంచి ప్రజలను సర్వేల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని వివరించారు. దీంతో పాటు ఇటీవల ప్రకటించిన నాలుగు సంక్షేమ పథకాలలో లబ్ధిదారులను తగ్గించడం కోసం అనేక కొర్రీలు పెట్టి సంక్షేమ పథకాలు రాకుండా చేస్తున్నారని తెలిపారు. మండలంలో ఒక గ్రామంలో నాలుగు పథకాలు విజయవంతంగా అమలు చేస్తామని ప్రకటించి వాటిలో ఒక్కహామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. నేటికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 420 రోజులు పూర్తి అయిన సందర్భంగా 420 హామీలు అమలు చేయలేదని అందుకోసం నిరసనగా నేడు మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రం ఇవ్వాలని అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శంషాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

శంషాబాద్ పట్టణంలో.. పోలీసుల విస్తృత తనిఖీలు

నిషేధిత గుట్కాలు అమ్ముతున్న ఆరుగురు అరెస్టు

శంషాబాద్ రూరల్, జనవరి 29 : శంషాబాద్ పట్టణంలో బుధవారం సాయంత్రం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అర్‌జీఐఏ సీఐ బాల రాజు ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు నాలు